ప్రజాశక్తి

శనివారం 29 నవంబర్ 2025

పూలే ఆశయాలు సాధిద్దాం : ఐద్వా

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సమ సమాజ స్థాపనే ధ్యేయంగా సేవలు అందించిన మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలు సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుదామని ఐద్వా జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్యామల, చంద్రిక అన్నారు. జ్యోతిరావు పూలే వర్ధంతి కార్యక్రమాన్ని ఐద్వా ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా వ్యాప్తంగా మండలాలు, గ్రామాల్లో నిర్వహించారు. అనంతపురం నగరంలోని ప్రజాశక్తి కాలనీ, శ్రీశ్రీ నగర్, మహదేవ్ నగర్, గణే నాయక్ కాలనీ, చంద్రబాబు నాయుడు కొట్టాలు, సిపిఎం కాలనీలో విద్యార్థులు, స్థానిక ప్రజలతో కలిసి జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే జిల్లా వ్యాప్తంగా 9 కేంద్రాల్లో పూలే వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించామని నాయకులు తెలిపారు. అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన జ్యోతిరావు పూలే జీవితం సమాజానికి శాశ్వత మార్గదర్శకం అన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నగర కార్యదర్శి అశ్విని, నాయకులు గీత, రేణుకమ్మ, శైలజ, వహీదా, కుమారి, సరళ తదితరులు పాల్గొన్నారు.

పూలే చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఐద్వా నాయకులు, తదితరులు

కొత్త విత్తనచట్టంతో రైతుకు నష్టం

సమావేశంలో మాట్లాడుతున్న ఎపి రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి

రైతాంగ సమస్యలపై పోరాటాలకు రైతులను సన్నద్ధం చేయాలి

ఎపి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి

జిల్లా మహాసభలో రైతాంగ సమస్యలపై చర్చ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

కేంద్రప్రభుత్వం కొత్తగా తీసుకురావాలని యోచిస్తున్న విత్తన చట్టం 2025 రైతులకు తీవ్ర నష్టదాయకమైందని ఎపి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. గార్లదిన్నె మండలంలోని కల్లూరు గ్రామంలో అనంతపురం జిల్లా 13వ మహాసభ శుక్రవారం జరిగింది. రైతు సంఘం నాయకులు బడా సుబ్బిరెడ్డి, ఇస్మాయిల్ ప్రాంగణంలో జరిగిన ఈ మహాసభలో ముఖ్య అతిథిగా కె.ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. మహాసభ రెండవ రోజు ప్రారంభానికి ముందు ఎఐకెఎస్ పతాకాన్ని ఆవిష్కరించారు. మృతి చెందిన రైతు సంఘం నాయకులు బడా సుబ్బిరెడ్డి, ఇస్మాయిల్ చిత్రపటాలకు పూలమాలలు వేసినివాళులు అర్పించారు అనంతరం రైతు సంఘం నాయకులు నాగరాజు, శిరీష, మధు అధ్యక్షవర్గంలో ఈ మహాసభ ఆరంభమైంది. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విత్తనం చట్టం 2025ను తీసుకొచ్చేందుకు సిద్ధపడిందని తెలిపారు. దీని వలన కార్పొరేట్ కంపెనీలకు లాభం చేకూరనుందేతప్ప రైతులకు ఏ మాత్రం ప్రయోజనం లేదని అన్నారు. అదే విధంగా విద్యుత్ సంస్కరణల బిల్లును తెస్తోందన్నారు. ఇలా రైతులకు అన్ని విధాలుగా నష్టం చేకూర్చే చట్టాలనే కేంద్రం తీసుకొస్తోందని వివరించారు. ఇప్పటికే అమెరికా ఒత్తిళ్లకు లొంగి పంట ఉత్పత్తులపైనున్న దిగుమతి సుంకాలను తగ్గించిందన్నారు. పత్తి, మొక్కజొన్న, పప్పుశనగే కాకుండా పాల ఉత్పత్తులను సైతం దిగుమతి చేసుకోవడానికి ఇతర దేశాలకు అనుమతులను కేంద్ర ప్రభుత్వం ఇచ్చిందన్నారు. లీటరు రూ.26లకు అమెరికా నుంచి పాలు దిగుమతి చేసుకుంటే ఇక్కడి రైతులకు ఏ మేరకు గిట్టుబాటు ధర లభిస్తుందో వేరే చెప్పనవసరం లేదని పేర్కొన్నారు. ఇక పరిశ్రమల పేరుతో అటు కేంద్ర, ఇటు రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున భూముల సేకరణను చేపడుతున్నాయన్నారు. భూములు కోల్పోయి రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదముందన్నారు. రాయలసీమ జిల్లాలో ఎక్కడాలేనన్ని సోలార్ పరిశ్రమలను ఏర్పాటు చేయనున్నారన్నారు. ఏడాదికి ఎకరానికి రూ.30 వేలు చెల్లించి భూములు తీసుకుని వారు మాత్రం లక్షలాది రూపాయలను సంపాదించుకుంటున్నారన్నారు. లీజు పద్ధతిలో కాకుండా భాగస్వామ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. గిట్టుబాటు ధరల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదని అన్నారు. ఏ ఒక్క పంటకు సరైన గిట్టుబాటు ధర ఉండటం లేదని చెప్పారు. గిట్టుబాటు ధర కోసం పోరాడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. రైతాంగ సమస్యలపై రైతులదరినీ సమీకరించి పోరాటాలను సన్నద్ధం చేయాల్సిన అవసరముందని పిలుపునిచ్చారు. రైతులు పడుతున్న ఇబ్బందులు ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల గురించి కూడా రైతుల్లో ప్రచారం చేయాలని సూచించారు. అందరి మద్దతు కూడగట్టి పార్టీలకు అతీతంగా రైతులు సమస్యలపై కదిలే విధంగా కృషిచేయాలని పేర్కొన్నారు. ఈ మూడేళ్ల కాలంలో అనంతపురం జిల్లాలో రైతు సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాల నివేదికను రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి ప్రతినిధుల మందు ఉంచారు. పంటలబీమా కోసం.గిట్టుబాటు ధరలు కల్పించే అంశంపై పోరాడటం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఒ.నల్లప్ప ఎపి పండ్లతోటల రైతు సంఘం జిల్లా కార్యదర్శి శివారెడ్డి , కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు బాలరంగయ్య, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేధింపులతోనే ఆత్మహత్య

అమూల్య బంధువుల ఆరోపణ

ప్రజాశక్తి-అనంతపురం

'ఉద్యోగస్తుడని కోటి రూపాయలు ఖర్చుపెట్టి పెళ్లిచేస్తే..ఒక్క రోజు సుఖంగా ఉంచలేదు..చివరకు చనిపోయేటట్టు చేశాడు.' అంటూ అమూల్య బంధువులు రోధిస్తున్నారు. గురువారం రాత్రి అనంతపురం నగరంలోని శారదనగర్‌లో ఉంటున్న ఆర్‌ఐ రవి భార్య అమూల్య తన కుమారుడి గొంతుకోసి తాను ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటు చేసుకున్న విషయం తెలిసిందే. మృతిచెందిన ఇద్దరికి శుక్రవారం పోస్టుమార్టం జరిగింది. ఈ సమయంలో అమూల్య బంధువులు పెద్దఎత్తున ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు. 'మంచి ఉద్యోగస్తుడని భావించి కోటి రూపాయలు కట్నంమిచ్చి పెళ్లి చేస్తే అమూల్య ఒక్క రోజు కూడా సుఖంగా లేదని కన్నీరుమున్నీరయ్యారు. తమ ఎదుటే కొట్టేవాడని వాపోయారు. ఈ గొడవలతోనే ఇంటికి కొస్తే రెండు రోజుల క్రితమే సర్దిజెప్పి వదిలివెళ్లినట్లు తెలిపారు. అంతలోనే తమ కుమార్తె, మనవుడు శవాలుగా మారారని అమూల్య తల్లి కన్నీరు పెట్టుకుంది. ఇంత జరిగినా ఇక్కడికి కూడా రాకుండా దాచిపెట్టుకున్నాడని బంధువులు ఆరోపించారు. వీరి మరణంపై అనుమానాలున్నాయని చెప్పారు. పోలీసులు కఠినంగా శిక్షించాలని కోరారు.

మోడల్‌పేపర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు, ఉపాధ్యాయులు

యుటిఎఫ్ మోడల్ పేపర్ ఉపయుక్తం

మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, డీఈవో ప్రసాద్ బాబు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

పదోతరగతి విద్యార్థులకు ప్రతి యేటా ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ప్రచురిస్తున్న పదో తరగతి మోడల్ పేపర్ పుస్తకం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, డీఈవో ఎం.ప్రసాద్ బాబులు పేర్కొన్నారు. యూటిఎఫ్ ఆధ్వర్యంలో ప్రచురించిన 2025-26 పదో తరగతి మోడల్ పేపర్ పుస్తకాన్ని స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో మాజీ ఎమ్మెల్సీ, డిఇఒ చేతుల మీదుగా శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులకు అనేక సదుపాయాలు సాధించడంలో, వారికి మెరుగైన వేతనాలు, ఫలాలపై పోరాటం చేయడంలో యుటిఎఫ్ ముందు భాగాన నిలుస్తోందని అభినందించారు. అవినీతికి వ్యతిరేకంగా రాజీలేని పోరాటాలు చేస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించడం కోసం రూపొందించబడిన ఈ పుస్తకం విద్యార్థులకు ఉపయోగపడేలా ఉండాలనే సామాజిక దృక్పథం కలిగిన సంఘంగా యుటిఎఫ్ నిలవడం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డివైఈవో మల్లారెడ్డి, ఏడి మునీర్ ఖాన్, సూపరింటెండెంట్ ఆదినారాయణ, లక్ష్మీనారాయణ, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు గోవిందరాజులు, ప్రధాన కార్యదర్శి లింగమయ్య, రాష్ట్ర ఆడిట్ కమిటీ మెంబర్ రమణయ్య, జిల్లా కార్యదర్శులు ప్రమీల, అర్జున్, సుబ్బరాయుడు, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ చంద్రమోహన్, సీనియర్ నాయకులు మహమ్మద్ జిలాన్, కోటేశ్వరప్ప, నాగేంద్ర, మెడికల్ రేప్స్ నాయకులు నాయకులు జాకీర్ హుస్సేన్, ఆదిశేషయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

5న మెగా పేరెంట్, టీచర్స్ మీటింగ్ 3.0 : కలెక్టర్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జిల్లావ్యాప్తంగా డిసెంబర్ 5వ తేదీన మెగా పేరంట్ టీచర్స్ మీటింగ్ 3.0 కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఓ.ఆనంద్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ రెవెన్యూ భవనంలో విలేకరుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ గతంలో రెండు మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్‌లను నిర్వహించామన్నారు. ఈ సంవత్సరం డిసెంబర్ 5వ తేదీన మెగా పేరంట్ టీచర్స్ మీటింగ్ 3.0 కార్యక్రమాన్ని చేయబోతున్నామన్నారు. 1వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, సంస్థల్లో, మోడల్ స్కూల్స్, కెజిబివి, ట్రైబల్ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్ సంస్థల్లో పిటీఎం నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు అర్థపూర్వకంగా, సమర్థవంతంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిఇఒ ప్రసాద్‌బాబు, డివిఇఒ వెంకటరమణ నాయక్, సమగ్ర శిక్ష ఏపీసీ శైలజ, తదితరులు పాల్గొన్నారు.

హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ సవరణ చేస్తాం: విప్ కాలవ

ప్రజాశక్తి-రాయదుర్గం

హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో గత వైసీపీ పాలనలో జరిగిన తప్పుల సవరణకు అనుమతి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబును కోరతామని విప్ కాలవ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి వస్తున్న వినతుల్లో సాంకేతిక సమస్యలతో కూడుకున్నవి ఎక్కువగా ఉన్నాయన్నారు. ముఖ్యంగా హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో ఐదారు కుటుంబాలు కలిసి ఒకే కుటుంబం కింద మ్యాప్ చేయడంతో అర్హత ఉన్నప్పటికీ ప్రభుత్వ పథకాలను పొందలేకపోతున్నాయన్నారు. ఇలాంటి తప్పిదాలను సరిదిద్దగలిగితే ఎక్కువ మంది లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందించడానికి వీలవుతుందన్నారు.

సుబ్బరాయసాగర్ డ్యాం పరిశీలన

ప్రజాశక్తి-పుట్లూరు

మండల పరిధిలోని సుబ్బరాయ సాగర్ డ్యాంను జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ శుక్రవారం పరిశీలించారు. గత 15 రోజుల క్రితం సుబ్బరాయసాగర్ షట్టర్లు ఎత్తుతుండగా అకస్మాత్తుగా షెటర్ రాడ్డు తెగిపోవడంతో మధ్యలోనే నిలిచిపోయింది. దీంతో హెచ్చెల్సీ అధికారులు తుంగభద్ర డ్యాంకు సంబంధించిన నిపుణులు పిలిపించి మరమ్మతులు చేయించాలని చూసినా ఫలితం లేకుండా పోయింది. చేసేదిలేక వృథాగా పోతున్న నీటిని 29వ డిస్ట్రిబ్యూటర్ నుంచి బొప్పేపల్లి చెరువుకు విడుదల చేశారు. కానీ పుట్లూరు, కోమటికుంట్ల, గరుగు చింతలపల్లి చెరువులకు నీరు రాకపోవడంతో ఆయా గ్రామాల్లోని రైతులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఈనేపథ్యంలో జాయింట్ కలెక్టర్ సుబ్బరాయుడు సాగును పరిశీలించి షట్టర్ మరమ్మతుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో హెచ్చెల్సీ ఎస్‌సి, ఇఇ పార్థసారథి, డిఇ సుబ్బరాయుడు, ఎఇ శ్రీనివాసులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



సుబ్బరాయ సాగర్ డ్యాం పరిశీలిస్తున్న జెసి

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

సిఐటియు జాతీయ మహాసభలు జయప్రదం చేద్దాం

రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సిఐటియు ఆధ్వర్యంలో డిసెంబర్ 31వ తేదీ నుంచి 2026 జనవరి 4 వరకు విశాఖపట్టణంలో నిర్వహిస్తున్న సిఐటియు 18వ ఆల్ ఇండియా మహాసభలను జయప్రదం చేద్దామని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్‌వి.నాయుడు, ఎస్.నాగేంద్రకుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో సిఐటియు ఆలిండియా మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఐటియు ఆలిండియా 18వ మహాసభలు 2025 డిసెంబర్ 31 నుంచి 2026 జనవరి 4 వరకూ 5 రోజుల పాటు విశాఖపట్టణంలోని ఆంధ్రా యూనివర్సిటీ, కన్వెన్షన్ సెంటర్ బీచ్ రోడ్డులో జరుగుతున్నాయని తెలిపారు. ఈ ఆలిండియా మహాసభలకు దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి ప్రతినిధులు హాజరవుతారని, వివిధ దేశాల ట్రేడ్ యూనియన్ నాయకులు ఈ మహాసభలో పాల్గొని సౌహార్ద సందేశం ఇస్తారని తెలిపారు. నిరంతరం ఉద్యోగ, కార్మిక వర్గాల కోసం పని చేస్తున్న సిఐటియు మహాసభలు జయప్రదం కోసం జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలలో వివిధ రూపాల్లో కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ మహాసభలకు కార్మిక ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి ఎం నాగమణి, జిల్లా ఉపాధ్యక్షులు టి.గోపాల్, శకుంతల, జిల్లా కార్యదర్శులు, ముత్తుజా, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ పరికరాలను సద్వినియోగం చేసుకోండి

విప్ కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

పదెకరాల్లోపు భూమి ఉన్న రైతులకు కూటమి ప్రభుత్వం అందజేస్తున్న 90 శాతం సబ్సిడీ డ్రిప్పు పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని విప్ కాలవ శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం రాయదుర్గం మండల పరిధిలోని టీ.వీరాపురం గ్రామంలో రైతన్నా-మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగగా రైతు వన్నూరుస్వామి ఇంటి వద్ద ఉన్న డ్రిప్పు పరికరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరువు ప్రాంతంగా ఉన్న జిల్లా రైతాంగాం శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని సబ్సిడీతో డ్రిప్పు పరికరాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని లాభాలు గడించాలని సూచించారు. రాయదుర్గం నియోజకవర్గంలో 42,534 మంది రైతులకు రూ.58 కోట్లు అన్నదాత సుఖీభవ ద్వారా రైతు ఖాతాల్లో నగదు జమైనట్లు తెలిపారు. కాగా డిసెంబర్ రెండో వారంలో కనీస మద్దతు ధరపై వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం ఎడిఎ పద్మజ, వ్యవసాయ అధికారి అహ్మద్‌బాషా, పశువైద్యాధికారి సూర్యనారాయణరెడ్డి, మండల కన్వీనర్ హనుమంతు, వీరేష్, సోము, సుంకన్న, రాజశేఖర్, విజయ్‌కుమార్, గంగాధర్‌శెట్టి, పురుషోత్తం ఉమేష్, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : టిడిపి టౌన్ కన్వీనర్ బొమ్మామోహన్ ఆధ్వర్యంలో శుక్రవారం పంచాయతీలోని పంచాయతీలో 9, 13వ వార్డుల్లో 'రైతన్నా-మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా నాయకులు, సచివాలయ సిబ్బంది, వ్యవసాయ శాఖ అధికారులు ఇంటింటికీ వెళ్లి రైతుల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పి.కొత్తపల్లి సింగిల్‌విండో ప్రెసిడెంట్ బొల్లు శ్రీనివాస్‌రెడ్డి, టిడిపి నాయకులు జింకల సంజీవకుమార్, కాలువ గడ్డ రంగనాయకులు, పసల శ్రీరాములు, కరూరు శివశంకర్, రంగనాయకులు, ఆదినారాయణ, గంప మల్లయ్య, హుస్సేన్‌పీరా, నిరంజన్, వెంకటరమణ, జాఫర్‌సాదిక్, బంకు రాజు, దోమల హసేన్, పూల హుసేన్ కేశవాచారి, బెస్త రామాంజనేయులు, ఎర్రిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు : రైతుల అభివృద్ధి, శ్రేయస్సే రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వ లక్ష్యమని టిడిపి మండల కన్వీనర్ తాతిరెడ్డి లోకనాథరెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం మండలంలోని చాగల్లు గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి రైతులు పెట్టుబడి తగ్గించుకుని దిగుబడి, ఆదాయం పెంచుకునేందుకు సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ప్రతాపరెడ్డి, నాగార్జునరెడ్డి, కుచ్చి సాయిమోహన్, ఆదెన్న, అమరసింహ నాయుడు, నాగరాజు, లక్ష్మీనారాయణ, కృష్ణయ్య, కిరణ్, నరసింహారెడ్డి, నల్లప్ప, షేక్షావలి, రాము, మండల వ్యవసాయ శాఖ అధికారి మైతా కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

రైతుతో మాట్లాడుతున్న విప్ కాలవ శ్రీనివాసులు

గొర్రెలకాపరిపై మాజీ ఎమ్మెల్యే తనయుడి దాడి

బోరంపల్లి వద్ద ఉద్రిక్తత

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

రాయదుర్గం మాజీ ఎమ్మెల్యే హులికుంటప్ప తనయుడు విక్కీ గొర్రెల కాపరిపై దాడి చేసిన ఘటన శుక్రవారం రాత్రి మండలంలోని బోరంపల్లి గ్రామం వద్ద చోటు చేసుకుంది. దీంతో ఉద్రిక్తతకు దారితీసింది. వివరాలు ఇలా ఉన్నాయి. మాజీ ఎమ్మెల్యే కుమారుడు కారులో అనంతపురం వెళ్తుంగా మార్గమధ్యంలోని బోరంపల్లి వద్ద గొర్రెలు రోడ్డుపై ఇంటికి వెళ్తున్నాయి. అందుకు సంబంధించిన గొర్రెలు కాపరి ఆంజనేయ వెనకాల వెళ్తుండగా అడ్డుగా వచ్చాయని చెబుతూ దాడికి పూనుకున్నాడు. అంతలోగా అక్కడున్నవారు ఎందుకు అలా దాడి చేస్తున్నారని నిలదీశారు. తాను మాజీ ఎమ్మెల్యే కుమారుడిని అంటూ దబాయించారు. అయితే మాత్రం దాడి చేస్తావ్ అంటూ గొర్రెల కాపరి బంధువులు తిరగబడ్డారు. దీంతో మాజీ ఎమ్మెల్యే కుమారుడు పోలీసులకు ఫోన్ చేస్తానని బెదిరింపులకు దిగాడు. దాడి చేయడమే కాకుండా బెదిరిస్తావా అంటూ గొర్రెల కాపరి బంధువులు, గ్రామస్తులు కారును అడ్డుకొని నిలదీశారు. జనం రావడంతో జడుసుకున్న ఆయన కారులోంచి బయటకు రాలేదు. బోరంపల్లి గ్రామస్తులు వందలాది మంది అక్కడికి చేరుకోవడంతో ఉద్రిక్తత పరిస్థితికి దారితీసింది. చివరికి సిఐ హరినాథ్, రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు సరి చెప్పేయత్నం చేసినా ఆందోళన ఆగలేదు. అక్కడున్న పరిస్థితిని చూసి మాజీ ఎమ్మెల్యే కుమారుడిని పోలీసుల వాహనంలో ఎక్కించుకుని కళ్యాణదుర్గం వెళ్లిపోయారు. దాడిలో గాయపడ్డ బాధితుడు ఆంజనేయులు కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించుకుంటున్నారు.

పోలీసుల వాహనం ముదు నిరసన తెలుపుతున్న బాధితులు

'ఉపాధి' కూలీల సంఖ్య పెంచండి

పుట్లూరు : మండలంలోని అన్ని పంచాయతీల్లో ఉపాధి హామీ కూలీల సంఖ్య పెంచాలని ఎంపిడిఒ అలివేలమ్మ సూచించారు. శుక్ర వారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశంలో ఎంపిడిఒ మాట్లాడుతూ కూలీల ఇకెవైసిలో మండలం చాలా వెనుకబడి ఉందన్నారు. వెంటనే వందశాతం ఇకెవైసి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ తులసీప్రసాద్, టిఎలు, బీఎఫ్‌టిలు, ఎఫ్ఏలు, తదితరులు పాల్గొన్నారు.

దంత ఆరోగ్యంపై అవగాహన

అనంతపురం : ఎస్ఎస్‌బిఎన్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో ఇటికలపల్లిలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా శుక్రవారం దంత ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విజయ డెంటల్ ఆసుపత్రి వారు దంత శుభ్రత, సరైన బ్రషింగ్ పద్ధతులు, కవిటీలు, పళ్ల నొప్పి నివారణ, పిల్లల దంత రక్షణపై వివరించారు.

దీక్షలు చేస్తున్న కార్మికులు

కొనసాగుతున్న రిలే దీక్షలు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

సమస్యల పరిష్కారం కోసం స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారం కూడా కొనసాగాయి. దీక్షల్లో తాగునీటి పథకం యూనియన్ జిల్లా కోశాధికారి వన్నూరుస్వామి, గంగన్న, మురళి, భీమన్న, శంకరయ్య కూర్చొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాగునీటి పథకం కార్మికులను కాంట్రాక్టర్లు వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు తగ్గిస్తామంటూ బెదిరిస్తున్నారని వాపోయారు. ఖాళీ బాండ్లలో సంతకాలు చేయించుకుని మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. అధికారులు స్పందించి దౌర్జన్యపరులపై చర్యలు తీసుకుని కార్మికులకు న్యాయం చేయాలని కోరారు.

అరటి, మొక్కజొన్న రైతులను ఆదుకోండి

వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజనాథ్

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

కూటమి నాయకులు గాల్లో తిరగడం మానేసి నష్టపోతున్న అరటి, మొక్కజొన్న రైతులను ఆదుకోవాలని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజనాథ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని నీలారెడ్డిపల్లి, కొత్త చెదుళ్ల గ్రామాల్లో అరటి పంటను సాగు చేసిన రైతులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు వైసిపి ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. కూటమి ప్రభుత్వం కల్లబొల్లి మాటలతో రైతులను మోసం చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ గాల్లో, పరదాలు కట్టుకుని తిరగకుండా భూమి మీద తిరిగి రైతుల వద్దకు వస్తే వారి బాధలు అర్థమవుతాయన్నారు. బుక్కరాయసముద్రం, శింగనమల, నార్పల, పుట్లూరు, యల్లనూరు, తాడిపత్రి తదితర ప్రాంతాల్లో అరటి పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. వీరితోపాటు మొక్కజొన్న సాగు చేసిన రైతులు కూడా కనీస మద్దతు ధర లేకపోవడంతో నష్టపోతున్నారన్నారు. కావున వెంటనే ప్రభుత్వం స్పందించి అరటి, మొక్కజొన్న రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు, గువ్వల శ్రీకాంత్‌రెడ్డి, జడ్పిటిసి భాస్కర్, చెదుళ్ల సర్పంచు శ్రీనివాసరెడ్డి, రోటరీపురం వైఎస్ సర్పంచు శ్రీనివాసరెడ్డి, బుక్కరాయసముద్రం సర్పంచు పార్వతి, అంకే నరేష్, ఎస్సీ సెల్ నాయకులు వడియంపేట అంజి, వజ్రం గంగరాజు, గార్లదిన్నె ఎస్సీ సెల్ నాయకులు కోటంక నారాయణస్వామి, వైసిపి నాయకులు ముత్యాల శ్రీనివాసులు, కాలవ నారాయణస్వామి, పూల నారాయణస్వామి, నిమ్మల భాస్కర్, గాంధీనగర్ ఆది, తదితరులు పాల్గొన్నారు.

అరటి గెలను పరిశీలిస్తున్న వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజనాథ్

ప్రజాశక్తి
www.prajasakti.com

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

ప్రజాశక్తి-కుందుర్పి

గ్రామాలను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. శుక్రవారం మండలంలో ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన చేశారు. ఇందులో భాగంగా కుందుర్పి-కొలిమి పాళ్యం రోడ్డు, మలయనూరు గ్రామపంచాయతీలో రూ.5లక్షలతో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రచారంలో ప్రజలు తన దృష్టి తీసుకొచ్చిన సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకటశివుడుయాదవ్, మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ లక్ష్మీదేవి, మండల కన్వీనర్ ధనుంజయ, మాజీ వైస్ ఎంపిపి రవి, మాజీ కోఆప్షన్ సభ్యులు తాహిర్, మాజీ సర్పంచ రాఘవేంద్ర బాబు, మార్కెట్ డైరెక్టర్ వై.ఓబయ్య, నాయకులు సంజీవస్వామి, గంగాధర, ఎర్రగుంట ఆనంద్, రామమూర్తి నాయుడు, హనుమంతురాయుడు, పెద్ద నరసింహప్ప, నిజవల్లి తిప్పేస్వామి, కర్తనపర్తి రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

ఉపాధ్యాయుల చొరవకు ప్రశంసల జల్లు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

విద్యార్థుల క్రీడాసక్తిని గుర్తించిన ఓ నాయకుడు విద్యార్థులకు స్పోర్ట్స్ బూట్లు అందజేశారు. పాఠశాలలో రాష్ట్రస్థాయి వాలీబాల్ క్రీడా పోటీలకు విద్యార్థులు ఎంపికైన నేపథ్యంలో పాఠశాలలో వాలీబాల్ నెట్ ఏర్పాటు చేసి బాల్ అందజేశారు. పి.వీరన్నపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సంక్షేమం కోసం ప్రధానోపాధ్యాయుడు తీసుకున్న చర్యలపై 'పాఠశాల ప్రాంగణంలో కూరగాయల సాగు' అనే శీర్షికతో శుక్రవారం ప్రజాశక్తిలో కథనం వెలువడిన విషయం విదితమే. ఇందుకు స్పందించిన టిడిపి నాయకులు చిన్నవడుగూరు దివాకర్‌రెడ్డి పాఠశాలను సందర్శించి పాఠశాలలో ఆకుకూరలు సాగు, మధ్యాహ్న భోజనంలో వడ్డిస్తున్న ఆకుకూరల వంటను పరిశీలించి ఉపాధ్యాయులను ప్రశంసించారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి వాలీబాల్ క్రీడల పోటీకి ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు తెలుసుకుని విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. తర్వాత పాఠశాలలో వాలీబాల్ నెట్ ఏర్పాటు చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు రమేష్‌బాబు, సైన్స్ ఉపాధ్యాయులు కుళ్లాయప్ప, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా దుస్తులు, వస్తువులు పంపిణీ చేస్తున్న దృశ్యం

7న జాతీయ ఉపకార వేతన పరీక్ష

అనంతపురం సిటీ: 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఈనెల 7వ తేదీన ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జాతీయ ఉపకార వేతన పరీక్ష నిర్వహించనున్నట్లు డిఇఒ ప్రసాద్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు తమ హాల్ టికెట్లను ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయ వెబ్‌సైట్ డబ్ల్యు డబ్ల్యు డబ్ల్యు.బీఎస్ఇ.ఏపీ.గవ్.ఇన్‌లో లాగిన్ అయ్యి డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు.

లాప్రోస్కోపీ సర్జరీలపై అవగాహన

అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అనంతపురం: అనంతపురం నగరంలోని ఐఎంఎ హాల్లో శుక్రవారం గైనకాలజీ విభాగంలో లాప్రోస్కోపీ సర్జరీలపై ప్రముఖ గైనకాలజీ డాక్టర్ బి.రమేష్ సిఎంఇలో వైద్యులకు నూతన విధానాలపై వివరించారు. ఆధునిక టెక్నాలజీని వినియోగించి లాప్రోస్కోపీ సర్జరీలను సౌకర్యవంతంగా చేయటంతో పాటు ప్రజలకు కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ గైనకాలజిస్టులు డాక్టర్ రామ సుబ్బారావు డాక్టర్ అరుణ డాక్టర్ బాలకవాణి ఐఎంఎ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ నిరంజన్ రెడ్డి, ఫణి మహేష్ రెడ్డి పలువురు వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఎంపిడిఒ పర్యటన

బ్రహ్మసముద్రం: మండలంలోని సంతేకొండాపురం, కొండాపురం, సుగేపల్లి, కోనాపురం గ్రామాల్లో ఎంపిడిఒ చంద్రశేఖర్ శుక్రవారం పర్యటించారు. ఇందులో భాగంగా సచివాలయాలను తనిఖీ చేశారు. తర్వాత పారిశుధ్యం, పచ్చదనం పరిశుభ్రత, చెత్తసేకరణపై సిబ్బందిని ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ మల్లెల వనిత, పంచాయతీ కార్యదర్శి అనిత, వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రియాంక, వెల్ఫేర్ అసిస్టెంట్ హనుమంతు, లైన్‌మెన్ లింగరాజు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

కళ్యాణదుర్గం టౌన్: కళ్యాణదుర్గంలో టిడిపి నాయకుల వేధింపులతో ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించి మంచానపడ్డ బాధిత మహిళ కుటుంబానికి వైసిపి సమన్వయకర్త మాజీ ఎంపి తలారి రంగయ్య శుక్రవారం ఆర్థికసాయం చేశారు. టిడిపి నాయకుల వేధింపులతో ఇటీవల చంద్రకళ ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించి అనారోగ్యంపాలై ఇంటికే పరిమితమైంది. విషయం తెలుసుకున్న రంగయ్య ఎస్‌ఆర్‌సిపి జనార్దన్‌రెడ్డి, దీపక్‌రెడ్డితో కలిసి శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.2.20లక్షలు ఆర్థికసాయం అందించారు.

నేటి నుంచి క్రికెట్, త్రోబాల్ జట్ల ఎంపిక

బెలుగుప్ప: మండలంలోని ఈనెల 29, 30వతేదీల్లో మండలంలోని పురుషులు, బాలికలకు క్రికెట్, త్రోబాల్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఉపాధ్యాయులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎర్రగుడి గ్రామంలో పురుష ఉపాధ్యాయులకు క్రికెట్ జట్టు, బెలుగుప్పలో మహిళా ఉపాధ్యాయినులకు త్రోబాల్ జట్టు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

బేస్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు బెలుగుప్ప విద్యార్థి

బెలుగుప్ప: స్కూల్ గేమ్ ఫెడరేషన్ అండర్-14 బేస్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి భార్గవ్ ఎంపికైనట్లు పీడీ గోపాల్‌రెడ్డి తెలిపారు. విద్యార్థిని ప్రధానోపాధ్యాయులు వెంకటప్రసాద్, పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్ రుద్రయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

IN THE COURT OF THE PRL.SENIOR CIVIL JUDGE, ANANTHAPURAMU
O.S NO: 17/2021

Between:
C.Krishnaveni and Others ...Plaintiffs
AND
C.Adinarayana and Others ...Defendants

NOTICE TO THE DEFENDANT NO:3

D3: C.Padmavathi, D/o Late Yaleti Nallappa, Agriculturist, R/of Alamuru Village, Anantapuramu Rural Mandal & District.

పై నెంబరు కేసులో 3వ ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తము 09-12-2025వ తేది ఉదయం 10:30 గంటలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(By order of the Court)
H.RAMASUBRAMANYAM,
A.PARAMESWAR,
Advocates, Anantapuramu
Cell:9866866411

IN THE COURT OF THE CIVIL JUDGE (JUNIOR DIVISION): RAYADURG
O.S.No. 85/2016.

Between:
P.Sreeram Gopal, ...Plaintiff
AND
1. K.Hanumanthappa, died L.R's.K.Bheemakka, & others. ...Defendants

NOTICE THE DEFENDANT

Nagalakshmi (D6) W/o Late Rajanna, (D/o Late K.Hanumanthappa) D.No.145, Bhagya Nagar, 1st cross, Kalyandurg road, Anantapuram town & dist.

Please take notice that the above named plaintiff has filed the above suit against your father K.Hanumanthappa, for land dispute, he died, L.R's 2 to 8 defendants are added, and the same stands posted to on 03-12-2025, for your appearance, So, you are hereby directed to appear before the hon'ble court at 10.30 a.m, on 03-12-2025, either in person or through the counsel without fail, with all the documentary evidence on which you propose to defend the matter. If you fail to appear on that day, you will be set ex parte and the matter will be determined exparte.

(By order of the Honourable Court)
SRI.M.S.HARI KRISHNA RAO,
Advocate, Rayadurg.

ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యే అమిలినేని

ఆర్థికసాయం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

రోడ్డు ప్రమాదాల్లో మృతిచెందిన రెండు కుటుంబాలకు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు శుక్రవారం ఆర్థికసాయం అందించారు. కళ్యాణదుర్గం మండలం బోరంపల్లి వద్ద వారంరోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో మానిరేవు గ్రామానికి చెందిన సల్లప్ప, బోరంపల్లి గ్రామానికి చెందిన సురేష్ మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు సల్లప్ప భార్య అనితమ్మకు, సురేష్ భార్య అరుణమ్మకు రూ.25వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. అంతేగాకుండా వారి పిల్లల చదువులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

శేషమహేశ్వరమ్మకు ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అవార్డు

ప్రజాశక్తి-అనంతపురం



ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ షయెస్టా ఆక్తర్ మెమోరియల్ నేషనల్ అవార్డు ఫర్ ఇంజినీరింగ్ కాలేజ్ బెస్ట్ ఉమెన్ టీచర్ 2025కు ఆచార్య శేషమహేశ్వరమ్మ ఎంపికయ్యారు. అవార్డుకు ఎంపికైనందుకు జెఎన్‌టియు ఉపకులపతి హెచ్.సుదర్శనరావు, రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, ఓఎస్డీ టూ విసి ఎన్.దేవన్న, తదితరులు అభినందనలు తెలిపారు

పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు : కలెక్టర్

కలెక్టర్ ఓ.ఆనంద్

మాట్లాడుతున్న కలెక్టర్ ఓ.ఆనంద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పారిశ్రామికవేత్తలను అన్నిరకాలుగా ప్రోత్సహించి పరిశ్రమల ఏర్పాటుకు సత్వర చర్యలు తీసుకోవాలని, పరిశ్రమలు ఏర్పాటు చేసేలా మంచి వాతావరణం కలగజేయాలని కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు. శుక్రవారం అనంతపురం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో 64వ జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ (డిస్ట్రిక్ ఇండస్ట్రీస్, ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కమిటీ) సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని పటిష్టం చేసేలా పారిశ్రామికవేత్తలను ఆహ్వానించి వారికి సకాలంలో సింగల్ డెస్క్ పోర్టల్ ద్వారా అన్ని రకాల అనుమతులను అందజేసి పరిశ్రమలు నెలకొల్పేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పిఎంఈజిపి పథకం ద్వారా అర్హులైన వారి నుంచి నాణ్యతగల పథకాలను ఎంపికచేయాలని జిల్లా పరిశ్రమల అధికారిని ఆదేశించారు. జిల్లాలో ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ పాలసీలో 2 యూనిట్లకు గాను విద్యుత్ రాయితీలకు రూ.3, 84,860 లక్షలు వడ్డీ రాయితీ కింద 4 యూనిట్లకుగాను రూ.4,68,806, పెట్టుబడి రాయితీ కింద 11 యూనిట్లకు గాను, రూ.3.88 కోట్లు, సబ్సిడీ మంజూరుకు ఆమోదం తెలిపారు. సింగిల్ విండో పోర్టల్ లో పారిశ్రామికవేత్తలు దరఖాస్తు చేసుకున్న అనుమతులను నిర్ణీత సమయంలో ఆమోదించాలని అధికారులను ఆదేశించారు. పరిశ్రమల స్థాపనకు ఎస్సీ, ఎస్టీ వర్గాల వారికి విరివిగా రుణాలు మంజూరు చేయించాలని ఎల్‌డిఎంని ఆదేశించారు. ఏపిఐఐసి పారిశ్రామికవాడలలో ఇంకా ఉత్పత్తి ప్రారంభించని యూనిట్లను వెంటనే ఉత్పత్తి ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని జెడ్‌ఎం ఏపిఐఐసిని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి శ్రీనివాస యాదవ్, జిల్లా పరిశ్రమల శాఖ ఎడి రాజశేఖర్ రెడ్డి, డిఆర్‌డిఏ పీడీ శైలజ, హార్టికల్చర్ డిడి ఉమాదేవి, డిటిసి వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

ఔషధ మొక్కల పెంపకంపై దృష్టి సారించాలి

సీనియర్ శాస్త్రవేత్త జ్ఞానేశ్వర్

ప్రజాశక్తి-ఆత్మకూరు

రైతులు ఆహార ధాన్యాలతోపాటు ఔషధ మొక్కల పెంపకంపై దృష్టి సారించాలని సీనియర్ శాస్త్రవేత్త జ్ఞానేశ్వర్ పిలుపునిచ్చారు. సిఐఎం ఎపి రాష్ట్ర నోడల్ అధికారి జి.కోటేష్‌కుమార్ ఆదేశాలతో మండలంలోని ముట్టాల గ్రామంలో సిఎస్ఐఆర్- కేంద్రీయ ఔషధ, సుగంధ మొక్కల సంస్థ ఔషధ మొక్కల సాగుపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో నాలుగు చోట్ల సుగంధ మొక్కల సంస్థ పరిశోధన కేంద్రాలు ఉన్నాయన్నారు. ఔషధ, సుగంధ మొక్కలు సాగు చేయడం రైతుకు లాభదాయకమన్నారు. ఒకసారి పంట వేస్తే నాలుగైదేళ్ల కోతలు వస్తాయని తెలిపారు. అంతేగాకుండా ప్రతిసారి పంట మార్పిడి చేయాల్సిన అవసరం లేదన్నారు. ఐదేళ్లకు ఓసారి పంట మార్పిడి చేస్తే సరిపోతుందన్నారు. ఔషధ మొక్కలు పశువులు తినలేవని తక్కువని నీరు ఉన్న పరిస్థితుల్లో కూడా సాగు చేసుకోవచ్చన్నారు. నీరు నిలిచే పొలాలు పనికిరావన్నారు పంట కోత సమయానికి వారంరోజులు ముందుగా నీటి తడులు తప్పించాలన్నారు. ఇకపోతే అనంతపురం పరిసర ప్రాంతాల్లో నిమ్మగడ్డి, కీష్ణతులసి, జరీనియం, కాశ గడ్డి (పామరోజ) సాగుకు అనుకూలంగా ఉంటుందన్నారు. ఇవన్నీ బహువార్షిక పంటలన్నారు. ఔషధ మొక్కలు తక్కువ పెట్టుబడితో ఐదేళ్లపాటు నిరంతరం పంట కోతలు చేపట్టి ఆదాయాన్ని సంపాదించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రప్రసాద్, దామోదర్‌గౌడ్, ప్రాజెక్టు అసిస్టెంట్లు వెంకటేష్, భరత్, పాపంపల్లి ముట్టాల గొరిదిండ్ల గ్రామాల రైతులు, తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలు అందజేస్తున్న దృశ్యం

పూలే ఆశయాలను కొనసాగిద్దాం

వర్ధంతి కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు

నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

మహాత్మా జ్యోతిబాపూలే ఆశయాలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వ పాలన సాగుతోందని అనంతపురం అర్బన్ టీడీపీ నాయకులు అన్నారు. పూలే వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం నగరంలోని అర్బన్ టిడిపి కార్యాలయంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల సంక్షేమంతో పాటు మహిళలకు విద్య అందాలని పరితపించిన మహనీయుడు జ్యోతిబా పూలే అన్నారు. అప్పటి సామాజిక రుగ్మతులకు వ్యతిరేకంగా పూలే పోరాడారన్నారు. తన సతీమణిని సాయిత్రి బాయిని చదివించి.. బాలికా విద్యను ప్రోత్సహించారన్నారు. ఈ కార్యక్రమంలో వీరశైవ లింగాయత కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ తుల్జాపూర్ స్వప్న, నాయకులు పోతుల లక్ష్మీనరసింహులు, పరమేశ్వర్, కడియాల కొండన్న, కోనంకి గంగారామ్, సుధాకర్ యాదవ్, సాకే లక్ష్మీనరసింహ, జోగి రాజేంద్ర, మణిరవి వాల్మీకి, వన్నూరప్ప, నెట్టెం బాలకృష్ణ, మణికంఠ బాబు, వడ్డే భవాని, శ్రీనివాస్‌గౌడ్, దాడి రమేష్, సురేష్, రియాజ్, శివ, కరణం ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : సమాజంలో ఆర్థిక, సామాజిక అసమానతలను రూపుమాపడానికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి జ్యోతిరావు పూలే అని విప్ కాలవ శ్రీనివాసులు కొనియాడారు. పూలే వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు కృష్ణమూర్తి, మండల కన్వీనర్ హనుమంతు, నాయకులు పురుషోత్తం, ప్రశాంతి, భారతి, జ్యోతి, జమీల్ ఖాన్ పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్ : అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం అలుపెరగని పోరాటం చేసిన సంఘసంస్కర్త, పూలే అని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కొనియాడారు. పూలే వర్ధంతి సందర్భంగా శుక్రవారం స్థానిక ప్రజావేదికలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

బస్సు డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి

ఎంవిఐ రాజబాబు

ప్రజాశక్తి-గుంతకల్లు

బస్సులు నడిపే సమయంలో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ రాజాబాబు సూచించారు. శుక్రవారం స్థానిక రాజేంద్రనగర్‌లోని శ్రీచైతన్య పాఠశాల వద్ద పాఠశాల బస్సులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా బస్సుల్లో భద్రతా ప్రమాణాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. బస్సుల పనితీరును పాఠశాల యాజమాన్యం ఎప్పటికప్పుడు సరిచూసుకోవాలని సూచించారు. అలాగే అగ్ని ప్రమాదాలు జరిగిన సందర్భంలో డ్రైవర్లు వెంటనే స్పందించి అగ్నిమాపక నియంత్రణ పరికరాలను ఉపయోగించాలన్నారు. బస్సులో ప్రయాణించే విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాముఖ్యత ఇవ్వాలన్నారు.

రాయదుర్గం : నియోజకవర్గ పరిధిలోని వివిధ విద్యాసంస్థలకు చెందిన స్కూల్ బస్సులను మోటారు వాహనాల తనిఖీ అధికారి ఎం.విశ్వనాథరెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఇందులో భాగంగా 33 బస్సులను తనిఖీ చేయగా 25 బస్సులకు అత్యవసర ద్వారం వద్ద సీట్లు ఏర్పాటు చేసి ఉండటాన్ని గమనించి నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. అంతేకాక ఒక బస్సు కాలవ్యవధి చెల్లిపోవడంతో నోటీసు జారీ చేశామన్నారు.

వాహనాలను తనిఖీ చేస్తున్న గుంతకల్లు ఎంవిఐ రాజబాబు

అరటి సాగులో మెలకువలు పాటించాలి

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

అరటి పంట సాగు చేసే రైతులు ఎకరాకు 1,200 నుంచి 1,250 మొక్కలను మాత్రమే నాటుకోవాలని ఎపిఎంఐపి పీడీ రఘునాథరెడ్డి, ఉద్యానవన అధికారిణి ఉమాదేవి సూచించారు. శుక్రవారం మండలంలోని ముచ్చుకోట, నామనాంకపల్లి, పసులూరు గ్రామాల్లో రైతులు సాగు చేసిన 2వ కోత అరటి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం అరటి పంటను స్థానిక వ్యాపారులు కిలో రూ.5-6, ఎక్స్‌పోర్ట్ కంపెనీలు రూ.7-8 ధరతో కొనుగోలు చేస్తున్నారన్నారు. కాగా రైతులు అరటి గెలలు నాటే సమయంలో మేలైన యాజమాన్య పద్ధతులను పాటించాలన్నారు. నాణ్యమైన అరటి గెల రావడానికి కనీసం 12 నుంచి 13 ఆరోగ్యమైన పచ్చని ఆకులు ఉండాలన్నారు. అరటి గెల కిందకు వంగిన తర్వాత తొండం పైభాగాన్ని ఆకుతో కప్పాలన్నారు. డెల్టా మైత్రిన్ 2.8 ఇసి అనే క్రిమిసంహారక మందు, గ్రోత్ ప్రమోటర్ వంటి ద్రావణాన్ని అరటిఉద్భవిస్తున్న పుష్పగుచ్ఛం మొగ్గపై నిర్దిష్ట దశలో ఉన్నప్పుడు పావు వంతు కింద భాగం ఇంజక్షన్ ఇవ్వాలని సూచించారు. వీటితోపాటు అనేక సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో రైతులు, తదితరులు పాల్గొన్నారు

బెలుగుప్ప : అరటి సాగులో జాగ్రత్తలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఉద్యాన శాఖ అధికారి బీసీ ధనుంజయ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని గంగవరం గ్రామంలోని అరటి ఫ్రూట్ కేర్ యాక్టివిటీపై ఎపిఎంఐపి అసిస్టెంట్ డైరెక్టర్ ధనుంజయ, ఉద్యానవన అధికారి కృష్ణతేజ, తదితరులు మండలంలోని గంగవరం గ్రామంలో సాగు చేసిన అరటి తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతలకు సలహాలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు, ఆర్‌ఎస్‌కె సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : మండల పరిధిలోని కొరివిపల్లి రైతు సేవాకేంద్రం పరిధిలోని జూలాకాలువ గ్రామంలో అరటిలో యాజమాన్య పద్ధతులపై ఉద్యానవన అధికారిణి శైలజ శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన సిబ్బంది పవన్‌కుమార్, నేత్రావతి, సంధ్యారాణి, రైతులు పాల్గొన్నారు.

బెలుగుప్పలో అరటి పంటను పరిశీలిస్తున్న అధికారులు

పిల్లలపై లైంగిక దాడులను నిర్మూలిద్దాం

రాయదుర్గం : జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి డాక్టర్ ఇబి దేవి ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని మోడల్ కాలనీలో ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పిల్లలపై లైంగిక దాడుల నిరోధం, ప్రారంభ బాల్య అభివృద్ధిపై శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా బాలల ఆరోగ్య సేవలు, అసంక్రమిత వ్యాధుల కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్ జి.నారాయణస్వామి పర్యవేక్షణలో మండల స్థాయి వైద్య ఆరోగ్య సిబ్బందికి వివరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు రమేష్, సందేశ్, మాధవ్, అజర్‌ఖాన్, జస్వంత్, కుమార్‌రాజా, నాజ్ నిన్, యశ్వంత్ రాజ్, ఎంఇఒ-2 వెంకట రమేష్, ఆరోగ్య విద్యా బోధకులు కె లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బాలికలు అన్నిరంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి-బెలుగుప్ప

బాలికలు పురుషులతో సమానంగా అన్నిరంగాల్లో విజయాలు సాధించినప్పుడే ఎంతో గౌరవం ఉంటుందని మిషన్ కోఆర్డినేటర్ డాక్టర్ బి.ఆర్ శ్రీదేవి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని కెజిబివి పాఠశాలలో బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు పాటల పోటీలు నిర్వహించి సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో 1098 జిల్లా సమన్వయకర్త, ఛైల్డ్ హెల్ప్‌లైన్ కృష్ణమాచారి, ఎంపిడిఒ లక్ష్మీనారాయణ, సిడిపిఒ శ్రీదేవి, ట్రైనీ ఎస్ఐ మహేష్, టిడిపి నాయకులు మల్లికార్జున, ఎస్ఒ నాగరత్నబాయి, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటరమణ, సిహెచ్ఒ పద్మావతి, ఎఎన్ఎం భారతి, మహిళా పోలీస్ కోమేల ఫక్రుణ్‌కుమారి, నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికకు స్థల పరిశీలన

ప్రజాశక్తి-శింగనమల

మండల పరిధిలోని పెద్దమట్లగొంది గ్రామంలో ఉన్న శ్మశాన వాటిక స్థలాన్ని ఎంపిడిఒ భాస్కర్ శుక్రవారం పరిశీలించారు. ఇటీవల నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో గ్రామానికి చెందిన కొందరు శ్మశాన వాటిక సమస్యపై వినతిపత్రం అందజేశారు. ఇందుకు స్పందించిన ఎంపిడిఒ భాస్కర్ గ్రామానికి చేరుకుని శ్మశాన వాటికి వెళ్లే దారిని పరిశీలించారు. త్వరలోనే శ్మశాన వాటిక సమస్యను పరిష్కరిస్తామన్నారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి పిల్లలకు అందిస్తున్న పోషకాహారంపై ఆరాతీశారు. తర్వాత రికార్డులను పరిశీలించారు. తర్వాత గోకులం షెడ్డును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ బి.మోహన్, తదితరులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

నార్పల : మండల పరిధిలోని బి.పప్పూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విశ్రాంత ఉపాధ్యాయుడు, సీనియర్ లయన్స్ క్లబ్ సభ్యులు జూటూరు షరీఫ్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు అట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు రాధా శ్రీదేవి మాట్లాడుతూ షరీఫ్ పాఠశాలలో హిందీ ఉపాధ్యాయునిగా పని చేసి పదవీ విరమణ పొందినప్పటికీ విద్యార్థులు పదో తరగతి పరీక్షలు బాగా రాయాలన్న గొప్ప సంకల్పంతో అట్టలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శ్రీధర్‌రెడ్డి, జగన్, మాధవి, పవిత్ర, రామన్న, వీరన్న, లలితమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

'వినత'కు బెస్ట్ ఉమెన్ కోఆర్డినేటర్ అవార్డు

ప్రజాశక్తి-శింగనమల

జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజీ యూనివర్శిటీ (జెఎన్‌టియు) ప్రదానం చేసే ప్రతిష్టాత్మక బెస్ట్ ఉమెన్ కోఆర్డినేటర్ అవార్డును ఎస్ఆర్ఐటీ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ వినత అందుకున్నారు. మహిళా సాధికారత, విద్యారంగ సేవలు, విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం, మార్గదర్శక కార్యక్రమాలు, కమ్యూనిటీ అవుట్‌రిచ్ యాక్టివిటీల్లో వినత చేస్తున్న నిరంతర కృషికి గుర్తింపుగా అవార్డు లభించింది. ఈ సందర్భంగా అవార్డును స్వీకరించిన వినతను ఎస్ఆర్ఐటి కళాశాల కరస్పాండెంట్ ఆలూరు సాంబశివారెడ్డి అభినందించారు.

డెంగీపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

గ్రామాల్లో డెంగీ వ్యాధి ప్రబలకుండా వైద్య, ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి రాజేష్‌కుమార్ సూచించారు. శుక్రవారం గొంచిరెడ్డిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన విలేజ్ హెల్త్‌క్లినిక్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే పాటించాలన్నారు. గ్రామాల్లో ప్రజలు రోగాల బారిన పడకుండా చూడాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిదే అన్నారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి తిరుపాలయ్య, హెల్త్ అసిస్టెంట్ జాన్సన్, ఎంఎల్‌హెచ్‌పి సాయి మౌనిక, ఎఎన్ఎం ఉమా, ఆశావర్కర్ ఆదిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మృతిచెందిన జ్యోతి

మహిళ ఆత్మహత్య

గుత్తి : గుత్తి ఆర్‌ఎస్ రైల్వే క్వార్టర్స్‌లో ఓ మహిళ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రంలోని మీరట్ పట్టణానికి చెందిన రాహుల్‌కుమార్ గుత్తిలో అసిస్టెంట్ లోకో పైలట్‌గా విధులు నిర్వహిస్తూ భార్య జ్యోతి (36)తో కలిసి గుత్తి ఆర్‌ఎస్ రైల్వే ఇన్స్టిట్యూట్‌కు వెళ్ళే దారిలో రైల్వే క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నారు. రాహుల్ కుమార్ విధుల నిమిత్తం ఎర్రగుంట్ల లైన్‌కు వెళ్లి శుక్రవారం డ్యూటీ దిగి ఇంటికి వచ్చాడు. ఇంటి తలుపు తట్టగా ఎంతసేపటికీ తలుపు తీయకపోవడంతో వెనకవైపు గోడదూకి తలుపు తీసుకుని ఇంట్లోకి ప్రవేశించాడు. ఇంట్లోని హాల్‌లో పైన దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వెంటనే కిందకు దించి చూడగా మృతి చెందినట్టు నిర్ధారించుకున్నాడు. అనంతరం స్నేహితులు, రైల్వే అధికారులకు సమాచారం అందించాడు. సమాచారం అందుకున్న ఎఎస్ఐ నూర్ మహమ్మద్ రైల్వే క్వార్టర్స్‌కు చేరుకుని విచారణ చేపట్టారు. జ్యోతి ఆత్మహత్య చేసుకోవడానికి కారణాలను భర్త రాహుల్ కుమార్‌తో విచారించారు. కాగా జ్యోతి మృతికి కారణాలు తెలియరాలేదు. అనంతరం మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వైటీ చెరువులో మహిళ మృతదేహం

విజయలక్ష్మి (పాతచిత్రం)

గుత్తి : గుత్తి ఆర్ఎస్‌లో అదృశ్యమైన డి.విజయలక్ష్మి (50) గుంతకల్లు మండలంలోని వైటీ.చెరువు గ్రామంలోని చెరువులో శవమై తేలింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గుత్తి ఆర్ఎస్‌లోని ఎవిఆర్ పాఠశాల ఎదురుగా నివాసం ఉండే రామాంజినేయులురెడ్డి భార్య డి.విజయలక్ష్మి ఈనెల 26న కనపడకుండా పోయింది. కుమారుడు లక్ష్మీకాంతరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అయితే శుక్రవారం గుంతకల్లు మండలం వైటీ.చెరువు గ్రామంలో చెరువులో నీటిలో తేలుతున్న మహిళ మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. స్థానికుల సమాచారంతో గుంతకల్లు రూరల్ పోలీసులు వైటి.చెరువు గ్రామానికి చేరుకుని పరిశీలించారు. గుత్తిలో మహిళ అదృశ్యమైనట్టు పోలీసులు కేసు నమోదు చేసి ఉండటంతో గుత్తి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వైటి.చెరువుకు గుత్తి పోలీసులు వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి గుత్తి ఆర్ఎస్ కు చెందిన విజయలక్ష్మిగా గుర్తించారు. అయితే మహిళ మృతిపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా విజయలక్ష్మిది హత్యా.. లేక ఆత్మహత్య.. అనేది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. మృతికి కారణాలు తెలియరాలేదని దర్యాప్తు చేపట్టామని గుత్తి సీఐ రామారావు తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీ.. వ్యక్తి మృతి

మృతిచెందిన ఎం.కృష్ణారెడ్డి

పెద్దపప్పూరు : మండలం పరిధిలోని ముచ్చుకోట గ్రామ సమీపంలో ద్విచక్ర వాహనపై వెళున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతిచెందిన ఘటన శుక్రవారం నెలకొంది. పోలీసులు, స్థానికుల సమాచారం మేరకు.. తాడిపత్రి బిందెలకాలనీకి చెందిన ఎం.కృష్ణారెడ్డి (40) సొంత పని నిమిత్తం అనంతపురం వెళ్తుండగా ముచ్చుకోట గ్రామ సమీపంలోకి రాగానే గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతిచెందినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు.

ద్విచక్రవాహనాల దొంగ అరెస్టు

రాయదుర్గం : పట్టణ పొలిమేరలో బళ్లారి రోడ్డు హిందూ శ్మశాన వాటిక సమీపంలో వ్యక్తిని అదుపులో తీసుకుని చోరీ చేసిన ఏడు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు రాయదుర్గం పోలీస్ ఇన్స్‌పెక్టర్ జె.జయనాయక్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. బొమ్మనహాల్ మండల కేంద్రానికి చెందిన డి.నాగరాజు వ్యసనాలకు అలవాటు పడి ద్విచక్ర వాహనాలను చోరీ చేసేవాడు. ఇందులో భాగంగా చోరీ చేసిన ఏడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని నిందితుడిని రాయదుర్గం కోర్టులో హాజరు పరిచినట్లు వివరించారు.